# నేను మీనాన్ననమ్మా!

**నేను సుబ్బారావుని! కాని నేను సుబ్బారావుని అని ఎంత గొంతు చించుకుని చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదు. నావైపే చూడ్డం లేదు!**

నా రూపం నేను పోల్చుకోలేనంతగా మారిపోయింది నా వాళ్లందరూ... నా భార్య, నా కొడుకు, యిద్దరు కూతుళ్లు ఎవరూ... నన్ను పోల్చుకో లేకపోతున్నారు! హయ్యో! నేనిప్పుడు... ఏం చెయ్యడం...? ఏం చెయ్యగలను కనుక? నా మనసులో ఎన్నో ఆలోచనలు వున్నాయి. కాని అవన్నీ ఎవరిక్కావాలి? అసలు నేను ఎవరికీ అక్కర్లేదు! ఇహ నా మనసు గురించి వాటి ఆలోచనల గురించి ఎవరికి బాధ? బాధంతా నాకే!

నా యింటి ముందు నేను నించున్నాను. లోపలికి వెళ్లడానికి ఏదో జంకు! భయం! నన్ను వాళ్లు రానిస్తారో, లేదోనని భయం. వాళ్లని నేను ఎంత హింసించేను...!

రోజూ రాత్రుళ్లు తాగొచ్చి సత్యవతిని... అదే.. నా భార్యని చితకబాదే వాడ్ని. జుట్టు పట్టుకుని ఈడ్చి తన్నే వాడ్ని. సత్యవతి కుమిలి కుమిలి ఏడ్చేది. భూదేవికున్నంత ఓర్పు నా భార్యకుంది.

"ఇంతగా తాగితే మీ వళ్లు పాడవుతుందండీ. ఈ తాగుడు మానండీ అంటే వినరు'' అనేది. నా చేత దెబ్బలు తిన్నందుకు తనకి బాధలేదు. నా వళ్లు పాడవుతుందని దానికి బాధ! పాపం పిచ్చి సత్యవతి! ఎంతమంచిది. అలాంటి దాన్ని పట్టుకుని కొట్టడానికి నాకు చేతులు ఎలా వచ్చేయో?!... నేను సత్యవతిని తల్చుకుని చాలా బాధపడిపోయాను. బయటనే ఒక మూల కూర్చున్నాను.

ఆలోచనలు నా మనసు చుట్టూ కందిరీగల్లా ముసురుకున్నాయి....

మూడు రోజులైంది క్లబ్బులో పేకాట... తాగుడు... తాగుడు... మత్తులో వున్నాను. ఇంటిక్కూడా వెళ్లకుండా జీతం డబ్బులన్నీ పేకాటలో పోగొట్టుకుని బార్‌లో బాకీ పెట్టి మరీ తాగాను. మూడు రోజుల తర్వాత యిల్లు గుర్తొచ్చి యింటికి వచ్చాను. నా భార్య నా కోసం ఏడుస్తూ గుమ్మంలోనే నించుంది. ఆ ఏడుపు మోహం చూస్తే నాకు చెప్పలేనంత అసహ్యం వేసింది.

"ఎందుకీ వెధవ ఏడుపూ, నువ్వూనూ? రోజూ ఏడుపు మొహంతోనే వుంటావు ఏదో కొంపలంటుకు పోతున్నట్టు! అందుకే పేకాటలో అంతా పోతున్నది. మొగుడన్న వాడు కష్టాల్లో వుంటే డబ్బు సర్దుబాటు చెయ్యడం తెలీదు. కాని ఏడవడం మాత్రం బాగా వచ్చు." అని నా పెళ్ళాడ్ని బరబరా లోపలికి యీడ్చుకు వెళ్లి నేను అలసి పోయిందాకా కొట్టాను. నా పెద్ద కూతురు సునీత అడ్డు పడింది.

"ఏంటి నాన్నా యిది? మీ కోసం మూడు రోజుల బట్టి అన్నం, నీళ్లు ముట్టకుండా ఏడుస్తూ కూర్చుంది. అలాంటి దాన్ని పట్టుకుని కొట్టడానికి అసలు మీకు చేతులెలా వచ్చాయి?' అంది నిలదీస్తూ.

నాకు సునీత మీద కోపం వచ్చింది. బి.కామ్. పాసయి ప్రయివేట్ కంపెనీలో వుద్యోగం చేస్తూ యింటి బరువు - బాధ్యతలని తన నెత్తి మీద వేసుకుంటున్న సంగతి నాకా సమయంలో గుర్తుకు రాలేదు.

తాగిన మత్తు యింకా వదల్లేదు నాకు.

"ఏంటే! పెద్దా - చిన్నా లేకుండా ఆ వాగుడు! మన యింటా - వంటా లేదు పెద్దవాళ్లకి ఎదురు జవాబులు చెప్పడం!" అరిచాను నేను.

"తాగుడు మన యింటా - వంటా వుందా?" అంది రకీమని.

వెంటనే చాచి లెంపకాయ కొట్టాను దానిని. సునీతకి కళ్లు బైర్లు కమ్మేయి. అక్కడే చతికిలపడి పోయింది. సత్యవతి ఓ మూల కూర్చుని ఏడుస్తూ వుంది.

నా కొడుకు చంద్రం యింకా చిన్నవాడు. హై స్కూల్లో చదువుతున్నాడు. నాకేకలకి భయపడి పక్క గదిలోకి పారిపోయాడు. నేను వాళ్ళ ఖర్మానికి వాళ్లని వదిలేసి గదిలోకెళ్లి పడుకున్నాను. ఉదయం లేచే సర్కి మత్తు దిగిపోయింది.

సత్యవతి వంట చెయ్యలేదు. నేను ఏమీ తినకుండానే బ్యాంకు కెళ్లిపోయాను. నేను బ్యాంకు కేషియర్ని. అప్పటికే చాలా కేష్ చాకచక్యంగా నొక్కేసాను. కాని విధి వక్రించింది. ఎవరి మోసాలైనా ఎన్నాళ్లు దాగుతాయి?! నాకు ఛార్జ్‌షీట్ యిచ్చారు. అయినా నా దురలవాటు నేను మానలేదు. ఆ రోజు నేను బ్యాంకుకెళ్లేసర్కి సస్పెన్షన్ ఆర్డర్ చేతిలో పెట్టారు. 'సిగ్గు'ని అక్కడే వదిలేసి యింటికి వచ్చాను.

ఇప్పుడు కూతురి జీతం మీదే ఆధారపడి బ్రతుకుతున్నాం అందరం. అయినా మందు కొట్టడం మానలేదు. ఇంట్లో వాళ్లకి తెలియకుండా యింట్లో వున్న విలువైన వస్తువులన్నీ కరిగిపోయినా, తాగుడుకి ఈ మధ్య కొత్తగా దగ్గు పట్టుకుంది. విపరీతమైన దగ్గు. గొంతులోని నరాలన్నీ చిట్లిపోయేటంత యిదిగా దగ్గు. అలా దగ్గుతున్నప్పుడు రక్తం కూడా పడుతోంది.

నా భార్య ఏడుస్తూ నన్ను డాక్టరుకి చూపించింది.

"లివర్ పూర్తిగా పాడయిపోయింది. తాగుడు పూర్తిగా మానెయ్యాలి. మానేసినా ఎన్నాళ్లు బ్రతుకుతారో చెప్పడం కష్టం." డాక్టరు నా పెళ్లాంతో చెప్తూంటే విన్నాను. నాకేం షాకనిపించలేదు.

ఎక్కడికీ వెళ్లకుండా యింట్లోనే వుండే విధంగా గట్టి బందోబస్తే చేసింది నా పెద్ద కూతురు. నా భార్య ఏడుస్తూనే నాకు సేవలు చేస్తోంది.

★ ★ ★

*(ప్రియదత్త, వీక్లీ; 27-6-2001)*